క్లుప్తంగా

దివ్యాంగుల ఉపకరణాలకు 2న శిబిరం

పిఠాపురం: జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఏఎల్ఐఎంసీఓ సంస్థ సహకారంతో నియోజకవర్గంలో విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల గుర్తింపు కోసం వచ్చే నెల 2వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక అంబేడ్కర్ భవన్ రథాలపేట వద్ద శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు చక్రాల సైకిల్, వీల్ చైర్స్, చంక కర్రలు, కృత్రిమ కాళ్లు, కాలి పర్స్, రోలేటర్స్, చెవి మెషీన్లు, వాకింగ్ స్టిక్స్ తదితర ఉపకరణాల కోసం గుర్తింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. శిబిరానికి హాజరయ్యే విభిన్న ప్రతిభావంతులు సదరం ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డు ధ్రువ పత్రాల నకళ్లు తీసుకురావాలన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు

కొత్తపల్లి: ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం పిఠాపురం పోలీసులు తెలిపారు. మండలంలోని పొన్నాడ శివారు రావివారి పోడుకు చెందిన బోసం సూరిబాబు ద్విచక్ర వాహనాన్ని తన సోదరుడు ఇంటి వద్ద పార్క్ చేసి కోనపాపపేట వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్ఐ స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న వీఆర్ కృష్ణతేజ

పిఠాపురం: సమష్టి భాగస్వామ్యం, సమన్వయంతో పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు అన్నారు. పిఠాపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం పిఠాపురం ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్డీఏ, పంచాయతీరాజ్, జిల్లా పరిషత్, డ్వామా తదితర విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. పింఛన్ల పంపిణీకి అనుసరిస్తున్న విధానం, సీసీ రోడ్లు, డ్రైన్లు, ఇతర నిర్మాణ పనులు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు, తాగునీటి శుద్ధి, పారిశుధ్యం వంటి కార్యక్రమాల అమలు తీరు, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలుత ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీలలో పూడికలు తొలగింపునకు చర్యలు చేపట్టాలన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు సమగ్రమైన ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, డీపీవో కె.భారతి సౌజన్య, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మల్లిఖార్జున రావు, పెద్దాపురం డీఎల్డీవోలు పి.నారాయణమూర్తి, కేఏస్ఎన్వీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పిఠాపురం నియోజకవర్గంలోని సర్పంచులతో ఆయన సమావేశమై గ్రామాల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థాయిలో పరిమితులను దృష్టిలో ఉంచుకుని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఈఓ వేధింపులే కారణం

బోట్క్లబ్: తన భర్త చోడేరాజుకు గుండెపోటు రావడానికి ఆలయ ఈఓ జోగా సత్యనారాయణ కారణమని ఇంద్రపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న చోడేరాజు భార్య రమాదేవి అన్నారు. ఆసుపత్రి వద్ద ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈఓ బయటి వ్యక్తులను పెట్టుకుని ఆలయ తాళాలు కూడా వారికే ఇస్తూ, మూడు నెలలుగా జీతం కూడా ఇవ్వకుండా తన భర్తను మానసికంగా వేధింపులకు గురిచేశారన్నారు. తన భర్తను మనోవేదనకు గురిచేసిన ఈఓపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రాజు కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీ దేవాలయ సిబ్బంది వేల్ఫేర్ అసోసియేషన్ అధికారి ప్రతినిధి కోగంటి రవి కుమార్ కోరారు. కాగా విషయంపై ఆలయ ఈఓ జోగా సత్యనారాయణను వివరణ కోరగా చోడే రాజు గత జూన్ 29 నుంచి విధులకు హాజరుకావడం లేదన్నారు. అతనికి ఒక్క నెల జీతం కూడా పెండింగ్ లేదన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విజయనగరంలో ఆగస్టులో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో క్రీడాకారుల ఎంపికలు ఆదివారం కాకినాడ జిల్లా క్రీడామైదానంలో నిర్వహించినట్టు తైక్వాండో సంఘ అధ్యక్షుడు రాయుడు శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో జరిగిన ఎంపికలకు పురుషుల అండర్–15 విభాగంలో క్రీడాకారులు 55 మంది హాజరయ్యారు. ఎంపికలను ప్రారంభించిన రాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. ఎంపికల్లో కోశాధికారి సతీష్, సంయుక్త కార్యదర్శి శ్రీను, రిఫరీలు పరమేశ్వరి, తరుణ్, కోచ్‌లు కృష్ణ, రాజ, రాజేష్, సీహెచ్ సతీష్ పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి 18 మందిని ఎంపిక చేశారు.

భయం భయంగా..

- శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయం
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- వర్షాలకు తడిసి ముద్దవుతున్న రికార్డులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం

సామర్లకోట: ప్రస్తుతం కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ప్రమాదమే అని తెలిసినా సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. అయినా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. స్థానిక సత్యనారాయణపురంలో అద్దె భవనంలో ఉండే తహసీల్దార్ కార్యాలయాన్ని 1996లో పిఠాపురం రోడ్డులో పాత పోలీసుస్టేషన్ సమీపంలో నూతన భవనం నిర్మించి అక్కడకు మార్పు చేశారు. అయితే ఆ భవనం ఇరుకుగా ఉంటుందనే సమాచారం మేరకు జిల్లా స్థానిక అధికారుల అనుమతితో తహసీల్దార్ కార్యాలయాన్ని అక్కడ నుంచి పాత ఎంపీడీఓ కార్యాలయంలోనికి మార్పు చేశారు.

మరమ్మతులు చేసి..

సామర్లకోట సమితిగా ఉన్న సమయంలో నిర్మించిన ఆ భవనం శిథిల స్థితికి చేరు కోవడంతో జిల్లా పరిషత్ నిధులతో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోనే నూతన భవన నిర్మించారు. ఎంపీడీఓ కార్యాలయాన్ని కొత్త భవనంలోనికి మార్పు చేశారు. దాంతో ఖాళీగా ఉన్న పాత ఎంపీడీఓ కార్యాలయానికి కొద్దిపాటి మరమ్మతులు చేసి 2016లో తహసీల్దార్ కార్యాలయాన్ని ఇక్కడకు మార్పు చేశారు. ఈ కార్యాలయానికి అప్పట్లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న రాజప్ప ప్రారంభోత్సవం చేశారు. శ్లాబ్ లీక్ కావడంతో వర్షపు నీరు గదులల్లోకి చేరి రికార్డులన్నీ తడిసిముద్దవుతున్నాయి. దీనికితోడు శ్లాబ్ పెచ్చు ఊడి పడుతోంది. దాంతో అప్పట్లో ఉన్న తహసీల్దార్ జితేంద్ర కొద్ది పాటి మరమ్మతులు చేశారు.



తహసీల్దార్ కార్యాలయం గోడల నుంచి లీకవుతున్న వర్షపు నీరు



నిరుపయోగంగా ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయం

పైన పటారం.. లోన లొటారం..

తహసీల్దార్ కార్యాలయం చూడడానికి సుందరంగానే ఉంటుంది. అయితే వర్షాలు పడితే ఆ భవనం విషయం బయట పడుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు గోడల నుంచి వర్షపు నీరు లీకు కావడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడ విద్యుత్ షాక్‌కు గురవుతామేమోనని కార్యాలయ ఉద్యోగులు భయం భయంగా పని చేస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టరు పర్యటన తహసీల్దార్ కార్యాలయంలో ఉంటుందనే సమాచారం రావడంతో కార్యాలయం పరిస్థితి వివరించడానికి అవకాశం ఉంటుందని తహసీల్దార్‌తో పాటు సిబ్బంది భావించారు. అయితే సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన సమీపంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయానికి రాకుండా కలెక్టరు వేట్లపాలెం వెళ్లారు.

ముందు జాగ్రత్తగా..



నిత్యం అనేక మంది తమ తమ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్నారు. ఇటువంటి ప్రభుత్వ కార్యాలయం ప్రజలకు రక్షణగా ఉండాలి. భవనం శిథిల స్థితికి చేరుకోవడంతో ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉంది. ఈ కార్యాలయాన్ని పాత తహసీల్దార్ కార్యాలయంలోనికి మార్పు చేసి, నూతన భవన నిర్మాణం చేపట్టాలి.

– రెడ్డి శ్రీనివాసు, వైఎస్సార్ యువజన ఉమ్మడి జిల్లా కార్యదర్శి, సామర్లకోట

శిథిల స్థితిలో భవనం



తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిల స్థితిలో ఉన్న విషయాన్ని గమనించాం. ఎన్నికల బదిలీలో భాగంగా ఇక్కడకు వచ్చాను. ఇప్పుడు పశ్చిమ గోదావరి బదిలీ అయ్యే అవకాశం ఉంది. వచ్చే తహసీల్దార్, సిబ్బంది భవన సమస్యను ఎమ్మెల్యే ద్వారా కలెక్టరు దృష్టికి తీసుకొని వెళితే నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉంది. నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– వై శ్రీనివాసు, తహసీల్దార్, సామర్లకోట

పరిస్థితి గమనించిన అధికారులు

సార్వత్రిక ఎన్నికల ముందు వరకూ తహసీల్దార్‌గా పని చేసిన ఎస్ఎల్వీ కుమారి తహసీల్దార్ కార్యాలయం శిథిల స్థితిలో ఉందని భావించి పాత తహసీల్దార్ కార్యాలయంలోనికి మార్పు చేయాలని భావించారు. ఈ మేరకు అప్పటి వరకు పాత తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న సచివాలయాన్ని ఖాళీ చేయించారు. ఇంతలోనే ఆమెకు ఎన్నికల బదిలీ కావడంతో ఆ విషయం అక్కడే ఉండిపోయింది. శిథిల భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోంది. కార్యాలయం మార్పు చేసిన ఇరుకుగా ఉంటుందనే వాదనలు ఉన్నాయి. నూతన భవనాన్ని నిర్మిస్తే బాగుంటుంది.

అన్యమత ప్రచారంపై ఆందోళన



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

పిఠాపురం: నివాస గృహాల మధ్య ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహిస్తూ అన్యమత ప్రచారం చేయడంతో పాటు తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని గొల్లప్రోలు నగర పంచాయతీ పాత నూకాలమ్మ గుడి వీధికి చెందిన ప్రజలు ఆదివారం ఆందోళన చేపట్టారు. హిందూ దేవుళ్లను దూషిస్తూ తీవ్రమైన పదజాలంతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ మత మార్పిడికి ప్రయత్నిస్తున్నారని, ఇవి తమ మనోభావాలను దెబ్బ తీస్తున్నందున వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించిన పాస్టర్ మండల డేవిడ్‌రాజు, అతనికి ఇల్లు అద్దెకు ఇచ్చిన ఇంటి యజమానిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్ వారికి నచ్చజెప్పి పాస్టర్‌ను, ఇంటి యజమానిని అదుపులోకి తీసుకోవడంతో వారు ఆందోళన విరమించారు.

31న పెద్దాపురం మున్సిపల్ సమావేశం

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 31వ తేదీన మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కె.వి.పద్మావతి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఆయా శాఖల సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

న్యాయం చేసే వరకూ ఉద్యమం ఆగదు



రాక్ సిరామిక్స్ ఎదురుగా ఆందోళన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని కార్మికులు హెచ్చరించారు. ఆదివారం వర్షంలోను కార్మికులు తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకుడు గంగాధర్ మాట్లాడుతూ కార్మికులను తొలగించి 104 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులకు ఎటువంటి న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ సమయంలో కార్మికులను తొలగించడంతో గత 40 రోజులుగా ఫ్యాక్టరీ గేటు ఎదురుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. జాయింట్ లేబర్ కమిషన్ వద్ద ఐదు సార్లు జరిగిన చర్చలు కూడా విఫలమయ్యాయని తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రికి ఫ్యాక్టరీ యాజమాన్యం తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారని ఆరోపించారు. తమకు సీఐటీయూ అండగా ఉండడం వలనే ధైర్యంగా ఉన్నామని కార్మికులు తెలిపారు. ఆందోళనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్, కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, మల్లికార్జున రావు, వరప్రసాద్, క్రాంతి, అర్జునరావు, ప్రభుదాసు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు రౌతులపూడి పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం రాజవరం గ్రామానికి చెందిన కొల్లు నానాజీ (36) రౌతులపూడి మండలంలోని లచ్చిరెడ్డిపాలేనికి చెందిన ఓ మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. కాగా గత కొంతకాలంగా కుటుంబం, ఆరోగ్య పరంగా తలెత్తిన సమస్యల కారణంగా మనస్తాపం చెంది ఆదివారం ఉదయం బీబీపట్నం శివారున పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

గోకవరం: వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని వీరలంకపల్లికి చెందిన పైడిమళ్ల సోమరాజుకు, అల్లాడి నాగేశ్వరరావుకు గత కొంత కాలంగా భూ తగాదాలు ఉన్నాయి. ఆదివారం ఉదయం సోమరాజు తన పొలంలో పని చేస్తుండగా నాగేశ్వరరావు అతని వద్ద ఉన్న పదునైన వస్తువుతో దాడి చేశాడు. ఈ దాడిలో సోమరాజు వీపుపై బలమైన గాయమైంది. దీనిపై బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల సంబరం

- గ్రామ సర్పంచ్ దంపతుల ఆధ్వర్యంలో పూజలు



గొల్లప్రోలులో అమ్మవారి బోనాల గ్రామోత్సవం



నవర గ్రామంలో బోనాల సంబరం

సామర్లకోట: నవర గ్రామంలో ఆదివారం ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల సంబరం శక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు, ఆలయ ధర్మకర్త దమ్మాల లక్ష్మణ రావు, వీర నాగమణి దంపతుల ఆధ్వర్యంలో సంబరం జరిగింది. ఉదయం భక్తులు బోనాలు ఎత్తుకొని ఊరేగించి ఆలయానికి వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శివ సుబ్రహ్మణ్యం పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం రంగం కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. గ్రామంలోని చెరువు సమీపంలో ఆలయ నిర్మిస్తున్నారు. ఆషాఢ మాసం, అష్టమిని పురస్కరించుకొని గత రెండేళ్లుగా బోనాల సంబరం నిర్వహించిన్నట్లు గ్రామ సర్పంచ్ తెలిపారు. అనంతరం ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. దమ్మాల వెంకటరమణ, సూర్యనారాయణమూర్తి, చంటిబాబు, ఏడుకొండలు, వెంకటేశ్వరావు భక్తులకు సేవలందించారు.

శాకంబరి అలంకరణలో నూకాలమ్మ

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో వేంచేసి ఉన్న గ్రామ దేవత నూకాలమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసాన్ని పరస్కరించుకొని అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్‌కుమార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో పంచారామ క్షేత్రంలోని దీపారాధన సంఘ సభ్యుల సమక్షంలో సుమారు టన్ను కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేసి, పారాయణ చేశారు. ఆలయ కమిటీ నాయకులు మద్దుకూరి జోగారావు, యార్లగడ్డ శ్రీను, బొమ్మాలరావు, గోలి రాంబాబు, పెనుమరిత పెద్దకాపు, బోళ్ల శేఖర్, పారాయణ కమిటీ ప్రతినిధులు సత్తి అరుణ, చుండ్రు సరస్వతి, చలికి తుల సమ్మ, వరలక్ష్మి భక్తులకు సేవలందించారు.



శాకంబరిగా దర్శనం ఇచ్చిన సామర్లకోట నూకాలమ్మ అమ్మవారు



గొల్లప్రోలు పాదాలమ్మ అమ్మవారు

కన్నుల పండువగా పాదాలమ్మ బోనాలు

పిఠాపురం: గొల్లప్రోలులో వేంచేసియున్న పాదాలమ్మ అమ్మవారి బోనాల ఉత్సవం ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారికి గత కొన్ని రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు మొగలి అయ్యారావు ఆధ్వర్యంలో 210 మంది మహిళలు ఆదివారం బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిశూలం, కత్తి, నాగసర్పం, కుంకుమ భరిణి ధరించి చతుర్భుజిగా అమ్మవారు దర్శనమివ్వడం విశేషం. ఏటా ఆషాఢ మాసంలో పాదాలమ్మ అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిస్తుంటారు.

నీడ చూపవా సత్యదేవా !

- రత్నగిరిపై పశ్చిమ రాజగోపురం వద్ద గ్రీన్ షేడ్ నెట్ తొలగింపు
- ఎండ, వానలకు ఇబ్బంది పడుతున్న భక్తులు
- శాశ్వత షెడ్డు నిర్మించాలని మొర



సత్యదేవుని పశ్చిమ రాజగోపురం వద్ద కానరాని గ్రీన్ షేడ్ నెట్

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో చిన్న చిన్న సమస్యలు సైతం నెలల తరబడి పరిష్కారం కావడం లేదు. సమస్య ఉందని అందరికీ తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని భక్తులు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో అన్నవరంలో వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఇలా వచ్చే భక్తుల్లో సగానికి పైగా పశ్చిమ రాజగోపురం వైపు గల రోడ్డు ద్వారా వస్తారు. తిరిగి అదేమార్గంలో బయటకు వెళతారు. ఈ పశ్చిమ రాజగోపురం ముందు చాలా రోజుల పాటు గ్రీన్‌నెట్ షెడ్ (నెట్) ఉండేది. ఇది భక్తులకు ఎండాకాలంలో ఎండ నుంచి రక్షణ కల్పించేది. వర్షాకాలంలో ఈ నెట్‌కు గల సూక్ష్మ రంధ్రాల నుంచి వర్షపు నీరు భక్తులపై పడి ఇబ్బంది పడేవారు. కాగా నెల రోజుల క్రితం ఈదురుగాలులకు పశ్చిమ రాజగోపురం ముందు గల ఈ గ్రీన్ నెట్ చిరిగిపోవడంతో తొలగించారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ గ్రీన్ నెట్ వేయలేదు. అలాగని భక్తులు ఎండకు ఎండకుండా, వానకు తడవకుండా ఏమైనా ఏర్పాట్లు చేశారా ? అంటే అదీ లేదు. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

వర్షంతో ఇక్కట్లు

అల్పపీడనం ప్రభావంతో గత 15 రోజులుగా నిత్యం ఏదో సమయంలో వర్షం కురుస్తోంది. ఆ వర్షంలో తడుస్తూ భక్తులు పశ్చిమ రాజగోపురం ద్వారా స్వామివారి ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకుంటున్నారు. అనంతరం తిరిగి వచ్చే సమయంలో వర్షంలో తడుస్తూ ఇబ్బంది పడుతున్నారు. పశ్చిమ రాజగోపురం పక్కనే వ్రతాల టిక్కెట్ల కౌంటర్ ఉంది. ఆ కౌంటర్‌లో భక్తులు టిక్కెట్లు తీసుకునేందుకు కూడా గోపురం వద్ద షెల్టర్ లేక ఇబ్బంది పడుతున్నారు. దేవస్థానానికి వీఐపీలు వచ్చినా పశ్చిమ రాజగోపురం ద్వారానే స్వామివారి ఆలయానికి వెళతారు. వారు కూడా వర్షంలో తడుస్తూ వెళ్లడమో లేక అధికారులు ఏర్పాటు చేసిన గొడుగుల కింద వెళ్లడమో చేస్తున్నారు. కాగా గతంలో పశ్చిమ రాజగోపురం వద్ద గ్రీన్ నెట్ ఉండేదన్న ఆనవాళ్లకి ఆ నెట్ అమర్చిన ఇనుప గొట్టాలు అక్కడే నెల రోజులుగా దర్శనమిస్తున్నాయి.

శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రతి నిత్యం వేలాది మంది భక్తులు పశ్చిమ రాజగోపురం ద్వారానే సత్యదేవుని దర్శనానికి వెళుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. లేకుంటే స్వామివారి రథానికి వేసిన టెన్షెల్ షెడ్డు వంటిది వేసినా భక్తులకు ఇబ్బంది ఉండదు. గతంలో గ్రీన్ నెట్ ఎంత ఎత్తులో ఉండేదో అంతే ఎత్తులో షెడ్డు వేస్తే గోపురం కూడా భక్తులందరికీ కనిపించే అవకాశం ఉంది. ఈ మేరకు దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



గతంలో పశ్చిమ రాజగోపురం వద్ద ఉన్న గ్రీన్ షేడ్ నెట్, దాని దిగువన పందిరి

ఈ గొయ్యి పూడ్చరూ..

- ప్రమాదకరంగా వీకే రాయపురం రహదారి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సామర్లకోట: వీకే రాయపురం రహదారి ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డులో రధ్రం ఏర్పడినా పట్టించుకొనే నాధుడు కనిపించడం లేదని ఆ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి కాలువ నీరు వీకే రాయపురం మీదుగా వెళ్లడానికి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి వేగుల గుడికి మీదుగా పొలాలకు వెళ్ల రోడ్డులో పంట కాలువకు తూర ఏర్పాటు చేశారు. ఈ పంట కాలువ నుంచి బోయనపూడి, రామేశ్వరం, అచ్చుతాపురత్రయానికి సాగునీరు వెళుతుంది. అయితే ఈ రోడ్డు కింద ఉన్న తూర రంధ్రం పడి 15 రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆ గ్రామ రైతులు బస్వా శేషారావు, రేలంగి రాంబాబు, వెలమర్తి శ్రీనివాసు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో రంధ్రం పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఈ రంధ్రం కారణంగా భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనదారులు ప్రమాదానికి గురవుతారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త తూర ఏర్పాటు చేసి ప్రమాదాల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ఈ తూర రంధ్రంపై పంచాయతీ కార్యదర్శి వై శ్రీహరిని వివరణ కోరగా తూరను మార్చాలని ఇరిగేషన్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లామన్నారు. అక్కడ నుంచి అనుమతులు అందిన వెంటనే పని పూర్తవుతుందన్నారు.



వీకే రాయపురం ఆంజనేయస్వామి ఆలయం నుంచి పొలాలకు వెళ్లే మార్గంలో రోడ్డుపై పడిన గొయ్యి

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పిఠాపురం: పిఠాపురం శివారు ఏడు కాలువల వద్ద ఇటుక బట్టీలో అదే గ్రామానికి చెందిన గాది నూకరాజు(55) ఆదివారం మధ్యాహ్నం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. బొజ్జ సతీష్‌కు చెందిన ఇటుక బట్టీలో కూలి పనిచేస్తున్న నూకరాజు ఆదివారం మధ్యాహ్నం వాంతులు చేసుకుని ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. నూకరాజుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. స్థానికుల సమాచారం మేరకు పట్టణ ఎస్ఐ మురళీమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.